## క్లుప్తంగా

### ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



స్వామివారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మండల పూజ సందర్భంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని కాలనీలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

### నేడు నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్‌అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మూడు శిబిరాల వివరాలు... జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం, పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ పెన్నార్ ఇండస్ట్రీస్, శేరిలింగంపల్లి అల్యూమినియం ఇండస్ట్రీస్‌లలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

### దైవభక్తిని అలవర్చుకోవాలి



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పోచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రేణుకఎల్లమ్మ జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, సర్పంచ్ జగన్ శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ సుధాకర్‌గౌడ్, సర్పంచ్ జగన్, రామరాజు, భాస్కర్‌గౌడ్, భుజంగారెడ్డి, రాజు, లింగం, లక్ష్మణ్, కుమార్, నాగరాజు, నాగయ్య, భాస్కర్, విశాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కేఎస్‌జీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

### 15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అది, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్రైవ్‌లో 15 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

### కార్పొరేటర్ పర్యటన



మురుగు కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పుష్ప అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రధాన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా డ్రైనేజ్ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కార్పొరేటర్‌ను స్థానికులు కోరగా సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సీసీ రోడ్లును సైతం త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

### అయ్యప్పస్వాములకు అన్నదానం

జోగిపేట(అందోల్): జోగిపేట ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో స్వాములకు మంగళవారం అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు నారాయణ, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ నాగభూషణం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో ప్రజాపాలన కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదీ వరకే ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఉంటుందనే అపోహకు పోకుండా తేదీ ముగిసినా దరఖాస్తులను స్వీకరిస్తామని హామీనిచ్చారు. కొన్ని ప్రతిపక్ష పార్టీల వారు గ్రామాల్లో ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా యత్నిస్తున్నారని తెలిపారు. దరఖాస్తుదారుల్లో నిరక్షరాస్యులు ఎవరైనా ఫారాలు పూర్తిస్థాయిలో పూరించనిపక్షంలో ఏఏ సంక్షేమ పథకాలకు అర్హులు చూసి వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆర్డీఓ వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు రిజెక్ట్ కాకుండా అన్ని దరఖాస్తులు పూరించేలా చూడాలని సూచించారు. గ్రామసభలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. నిర్వహణ ఖర్చులకు పంచాయతీ ఖాతాలో రూ.10వేలు జమ అవుతాయని వివరించారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, డాక్టర్ రాజేష్, నాయకులు రమేష్‌చౌహాన్, కౌన్సిలర్లు వివేకానంద్, సద్దాం, హన్మండ్లు, గుండేరావు పాల్గొన్నారు.

## సైకిల్ యాత్రికులకు ఘన స్వాగతం



సైకిల్ యాత్రికులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

నారాయణఖేడ్: అయోధ్యలో నిర్మించిన రామమందిర ప్రారంభోత్సవంలో భాగంగా వచ్చే నెల 22న నిర్వహించనున్న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను కర్ణాటకలోని బీదర్ హనుమాన్ సేనకు చెందిన 10మంది ముఖ్య నాయకులు సైకిల్‌యాత్రగా అయోధ్యకు బయలుదేరారు. మంగళవారం సైకిల్‌యాత్ర ఖేడ్ మీదుగా కొనసాగుతుండగా పట్టణంలో స్థానిక భక్తులు సైకిల్ యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అల్పాహారం ఏర్పాట్లు చేశారు. అనంతరం యాత్రికులు నిజాంపేట్ వైపు బయలుదేరారు.

## అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు ఘటనలో మృతి చెందిన రెండు అనాథ మృతదేహాలకు ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీలో భిక్షాటన చేస్తూ జీవించే 35 ఏళ్ల వయసు ఉన్న మహిళ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా మరో ఘటనలో ముత్తంగి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులకు సంబంధించిన బంధువులు 5 రోజుల గడిచినా ఎవరూ రాకపోవడంతో పోలీసులు మృతదేహాలను ఎండీఆర్ ఫౌండేషన్‌కు అప్పగించగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

## పేదలకు అండ.. సీపీఐ జెండా

ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వినోద



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): నిరుపేదలకు అండగా సీపీఐ పోరాడుతోందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వినోద అన్నారు. సీపీఐ 99 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆ పార్టీ కార్యాలయం వద్ద సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం అమె మాట్లాడుతూ డిసెంబర్ 26–1925న యూపీలోని కాన్పూర్ పట్టణంలో ఏడుగురు సభ్యులతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. భూమిలేని పేదలకు ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతి సాగుభూములు, ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని తెలిపారు. సంగారెడ్డి ప్రాంతంలో 9 కాలనీలు, సదాశివపేట పట్టణంలో 5 కాలనీల్లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ పక్షాలను చిత్తుచిత్తుగా ఓడించడానికి వామపక్షాలు సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎండి ముస్తఫా, సాదిక్‌అలీ, దుర్గయ్య, ఉమర్, యాకుబ్, వెంకట్, ఏఐటీయుసీ నాయకులు శంకరయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మి, బీకేఎంయూ కార్మిక సంఘం మహిళా నాయకులు బుజ్జమ్మ, రహిబా బేగం, శంకరమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

## కేబీబీఎస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): రైతుల భూమి ఆక్రమించిన కేబీబీఎస్ ఇండస్ట్రీపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులోని ఇండస్ట్రీ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూమి అక్రమంగా ఆక్రమించి 33 ఫీట్ల నక్షబాటను మూసివేసి పదేళ్లుగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. పరిశ్రమ నిర్వాహకులకు 21సర్వే నంబర్‌లో మాత్రమే అనుమతులు ఉండగా పక్కనే ఉన్న మరికొంత భూమి కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డును పునరుద్ధరించి రైతుల భూములు కాపాడాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, శ్రీనివాస్, రైతులు సంజీవ్ కుమార్, రమేష్, శంకరయ్య, సమ్మప్ప, అంజప్ప, లింగప్ప, నర్సింహులు, బసవరాజ్, శంకరయ్య, రాములు, బసంతి, రాజు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే సునీతారెడ్డి
- ఘనంగా దత్త జయంతి



హత్నూర: దత్తాచల క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



పటాన్‌చెరుటౌన్: స్వామివారిని దర్శించుకుంటున్న నీలం మధు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు



రామచంద్రాపురం: దత్త జయంతిలో పాల్గొన్న కార్పొరేటర్ సింధురెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామ శివారులోని దత్తాత్రేయ క్షేత్రంలో దత్త జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.

**దైవభక్తిని కలిగి ఉండాలి**

వట్‌పల్లి(అందోల్): ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలోని దత్తాశ్రమంలో నిర్వహిస్తున్న దత్త జయంతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి కృష్ణ మహరాజ్ ఆయనను ఘనంగా సన్మానించారు.

**ఖేడ్ దత్తాత్రేయస్వామి ఆలయంలో...**

నారాయణఖేడ్: ఖేడ్‌లోని దత్తాత్రేయ ఆలయంలో దత్తా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, గౌరిపూజ, స్వస్తి పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులతో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సాగర్ శెట్కార్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా సన్మానించారు.

**సాయిబాబా ఆలయంలో..**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయంలో దత్త జయంతి నిర్వహించారు. ఎమ్మెల్సీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో జరిగిన దత్త జయంతిలో కార్పొరేటర్ సింధురెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఘనంగా దత్త జయంతి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో దత్త జయంతిని నిర్వహించారు. ఆశ్రమ పీఠాదిపతి దేవగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

**త్రిమూర్తుల అవతారం దత్త ప్రభువు**

పటాన్‌చెరు టౌన్: హత్నూర మండలం మధురలోని దత్తచల క్షేత్రంలో ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

**విద్యాపీఠంలో...**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల పరిధిలోని పసల్వాది శివారులోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో దత్త జయంతిని బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో దత్త జయంతి**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని దత్తాత్రేయ నగర్ కాలనీ, ప్రభుమందిరం, రాఘవేంద్రనగర్ కాలనీలోని హనుమాన్ మందిరాల్లో దత్త జయంతి వైభవంగా నిర్వహించారు. దత్తప్రభు మందిరంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కన్‌సాన్‌పల్లి గ్రామంలో..**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని దత్తాశ్రమంలో మంగళవారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశినాథ్ మహరాజ్ ప్రవచనాలు వినిపించారు.

# దరఖాస్తుదారులకు సహకరించండి

- ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే సునీతారెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకునేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ నర్సింహులు అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వం అందజేసే ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను పొందుటకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, జెడ్పీటీసీ అంజనేయులు, ఎంపీడీవో శారదాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమన్వయంతో పనిచేయాలి**

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పథకాలు అర్హులకే అందించే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో ప్రజాపాలనపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ముందస్తు ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

**'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి**

పటాన్‌చెరు: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణ, అవగాహన సమావేశాన్ని మంగళవారం మున్సిపల్ సమావేశం మందిరంలో నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ జ్యోతిరెడ్డి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**తెల్లాపూర్‌లో...**

ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి సూచించారు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**గ్రామసభలపై అవగాహన**

పుల్‌కల్(అందోల్): ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వామన్‌రావు అన్నారు.ఎంపీపీ సమావేశ మందిరంలో గ్రామ సభలపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జయలక్ష్మి, ఎంపీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈనెల 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్న సందర్భంగా దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవ అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమంపై మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ బానుకిరణ్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ సురేష్, ఏఈ కృష్ణ పాల్గొన్నారు.

**సమన్వయంతో దరఖాస్తులు స్వీకరించాలి**

రాయికోడ్(అందోల్): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో స్వీకరించాలని జహీరాబాద్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ సూచించారు. రాయికోడ్‌లోని ఐకేపీ సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మమతఅశోక్, ఎంపీడీఓ వెంకటేశం, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన కార్యక్రమంపై సమావేశం**

మునిపల్లి(అందోల్): ప్రజాపాలన కార్యక్రమంపై ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, తహశీల్దార్ చెన్‌మాళి పాల్గొన్నారు.

**అరు గ్యారంటీల అమలుపై సమీక్ష**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన ప్రభుత్వ అమలు చేయనున్న ఆరు గ్యారంటీల అమలుపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన చర్చించారు.

**గుమ్మడిదలలో..**

గుమ్మడిదలలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ సద్ది ప్రవీణ అధ్యక్షతన ఆరు గ్యారంటీల పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**బొల్లారం మున్సిపల్ పరిధిలో...**

జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన ప్రభుత్వ పథకాల అమలు, అర్హుల ఎంపిక తదితర విషయాలపై చర్చించారు.

**భాగస్వాములు కావాలి**

జోగిపేట(అందోల్): ఈ నెల 28 నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని అందోల్ మండల స్పెషల్ ఆఫీసర్ గీత అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ రమేష్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ సౌజన్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమతి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

### పెండింగ్ చలాన్లు చెల్లించాలి

రాయికోడ్(అందోల్): వాహనదారులు పెండింగ్ చలాన్ల చెల్లింపులో కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ చలాన్లు ఉన్నట్లతై 80 శాతం రాయితీతో చలాన్‌లను మీ–సేవా కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్తూర్ గ్రామంలోని గొల్ల శ్రీనుకు చెందిన గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దీంతో స్పందించిన జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ బాధిత రైతు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించేవిధంగా కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జానాబాయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ రాజు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామ సర్పంచ్ కుందెన రాజు(లడ్డు) మంగళవారం రెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శివభక్తి మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ 50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, నక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

కంది(సంగారెడ్డి): కంది మండల ప్రజాపరిషత్ సమావేశాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ నేడొక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ సరళపుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు.